www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -326 మంగళవారం 3 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



- కువైట్‌లో కూలిన అమెరికా యుద్ధ విమానాలు
- ఇజ్రాయిల్, హిజ్బొల్లా మధ్య కాల్పులు
- ఖమేనీ భార్య మన్సౌరే ఖోజాస్తే మృతి
- అమెరికా-ఇజ్రాయిల్ దాడుల్లో ఆమెకు గాయాలు..

# మూడోరోజూ భీకర పోరు


## గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడిన

**న్యూఢిల్లీ,ప్రజావినికిడి**
దాడులు, ప్రతి దాడులతో మధ్య ప్రాచ్యం వణికిపోతోంది. ఇజ్రాయిల్- అమెరికా సేనలు, ఇరాన్ దళాల మధ్య వరుసగా మూడో రోజు కూడా భీకర పోరు సాగుతోంది. బాంబు దాడులతో తమ ప్రియతమ సుప్రీం నేత ఖమేనీని, సీనియర్ అధికారులను అంతం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న ఇరాన్ ఇజ్రాయిల్‌పై, గల్ఫ్‌లోని అరబ్ దేశాలపై పెద్ద ఎత్తున క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించింది. మరోవైపు ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయిల్‌పై హిజ్బొల్లా రాకెట్లు, డ్రోన్లతో దాడి చేసింది. బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసిందని లెబనాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.
ఖమేనీ మరణానంతరం మరింత రెచ్చిపోయిన అమెరికా, ఇజ్రాయిల్ సైనికులు ఆదివారం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి స్థావరాలపై బాంబుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. అంతేకాక ఇరాన్ యుద్ధ నౌకలను కూడా అవి ధ్వంసం చేశాయి. కువైట్‌లో అనేక అమెరికా యుద్ధ విమానాలు నేల కూలాయి. అయితే పైలట్లు సురక్షితంగా బయట పడ్డారు. అరబ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ విరుచుకుపడడాన్ని ఖండిస్తూ**మిగతా 2లో...**



# భారత్ శాంతి, సుస్థిరతలనే కోరుకుంటుంది

## సౌదీ, బహ్రెయిన్, జోర్డాన్ దేశాధినేతలకు మోదీ ఫోన్
## మోదీకి ధన్యవాదాలు తెలిపిన నెతన్యాహు



**న్యూఢిల్లీ,మార్చి2ప్రజావినికిడి**
పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ ఎప్పుడూ శాంతి, సుస్థిరతలనే కోరుకుంటుందని ప్రధాని మోదీ చెప్పారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో కెనడా ప్రధాని కార్నీతో సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొన్న మోదీ పశ్చిమాసియాలో పరిస్థితులపై మాట్లాడారు. చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలనేదే భారత విధానమని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీ.. సౌదీ, బహ్రెయిన్, జోర్డాన్ దేశాధినేతలకు ఫోన్ చేశారు. సౌదీ అరేబియా రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో మోదీ **మిగతా 2లో...**

# బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి

## కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు
## డీసీసీ అధ్యక్షులే మన సైన్యంపని చేయండి..- పదవులు అవే వస్తాయి
## పార్టీ నిర్మాణంపై దృష్టి సారించండి -వచ్చే రోజులన్నీ మనవేనంటూ దిశా నిర్దేశం
## వికారాబాద్‌లో ముగిసిన శిక్షణా కార్యక్రమాలు



హైదరాబాద్ **మార్చి2ప్రజావినికిడి**
ఇండో అమెరికా ట్రేడ్ డీల్ మనకు అత్యంత ప్రమాదకరమని పార్లమెంటులో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ చర్యలతో మనదేశంలో సైతం యుద్ధ వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన పూర్తిగా దాసోహమయ్యారని ఎద్దేవా చేశారు. అందుకే మోడీ.. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌లో తలెత్తిన పరిస్థితులు ఇండియాలో రాకుండా చూసుకోవాలని ఆయన దేశ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.**మిగతా 2లో...**

# రాజ్యసభకు మరో రెండురోజులే గడువు

## సభలో రాజ్యసభ ప్రస్తావన
## సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక
## సంఘ్విని తమిళనాడునుంచి పంపాలని సూచన



వికారాబాద **మార్చి2ప్రజావినికిడి** రాజ్యసభ నామినేషన్లకు మరో రెండు రోజుల గడువే ఉంది, ఈ రెండు స్థానాలను బలం రీత్యా కాంగ్రెస్ గెలచుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు అబ్యరథులను ఖరారు చేయలేదు. వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగిందని సమాచారం. **మిగతా 2లో...**

# ఏఐ కల్పిత తీర్పులతో జాగ్రత్త

## వాటి వినియోగంతో న్యాయ ప్రక్రియ
## దుర్వినియోగమయ్యే ప్రమాదం
## వాటిపై ఆధారపడి తీర్పులు ఇవ్వొద్దు
## ఏపీ హైకోర్టు తీర్పును పక్కనపెట్టిన సుప్రీం



**న్యూఢిల్లీ, మార్చి2ప్రజావినికిడి**
కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఆధారంగా రూపొందించిన కల్పిత తీర్పు ల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ దిగు వ కోర్టులను సుప్రీంకోర్టు అప్రమత్తం చేసింది. కల్పిత ఏఐ తీర్పుల ఆధారంగా తీసుకునే నిర్ణయాల వల్ల న్యాయ ప్రక్రియ **మిగతా 2లో...**

# మైనింగ్ఇ-వేలంలో భారీగా అక్రమాలు

## వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి
## సిఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్, **మార్చి2ప్రజావినికిడి**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. **మిగతా 2లో...**

# వేయికోట్లు వసూలుకు వచ్చారా

## రాహుల్ రాకపై కెటిఆర్ ఎద్దేవా



2లో.

# హైడ్రా ఇళ్ల కూల్చివేతపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం



2లో.

# బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి

మొదటిపేజీ తరువాయి

బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తొమ్మిది రోజులపాటు కొనసాగిన తెలంగాణ, ఏపీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీలు) శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి.

ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని కూడా నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై డీసీసీలకు రాహుల్‌గాంధీ దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో నెలకొన్న పరిణామాల గురించి ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అహింసా వాదాన్ని నమ్ముతూ రాజకీయాలు చేస్తుంటే.. బీజేపీ హింసావాదంతో ముందుకు సాగుతోందని విమర్శించారు. తాము గాంధేయ వాదాన్ని అనుసరిస్తే.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు గాడ్సే బాటలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని చెప్పారు.

వాటన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. డీసీసీ అధ్యక్షులే తమ పార్టీకి అసలైన సైన్యమని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అందువల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారి పాత్రను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపులను నూటికి నూరుశాతం జయప్రదం చేయాలని సూచించారు. తెలంగాణ, ఏపీల్లోని



సామాజికాంశాలపై అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం జోడెడ్లలాగా పని చేస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ నేతలు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుని ముందుకు పోవాలని రాహుల్ ఈ సందర్భంగా సూచించారు. అహాన్ని పక్కనపెట్టి పని చేయాలని హితవు పలికారు. 'ఇగో'ల కంటే పార్టీ ముఖ్యమనే విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. ఒక్కో డీసీసీ అధ్యక్షుడు మరో పదిమంది క్రియాశీలక నాయకుల్ని తయారు చేయాలని దిశా నిర్దేశం చేశారు. పని చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలని కోరారు.

**మార్షల్ ఆర్ట్స్‌తో క్లాస్‌డ**

సమావేశంలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ చేస్తూ వినూత్నంగా సందేశమిచ్చారు. అందులోని మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీకి ఒంటిపై ఒక బట్ట తప్ప ఏమీ ఉండదని గుర్తు చేశారు. అంతటి నిరాడంబరుణ్ని బ్రిటీష్ వారు సైతం ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టించి పని చేయండి.. రానున్న రోజులన్నీ మనవేనంటూ భరోసానిచ్చారు.

**కాంగ్రెస్ శివుడు.. బీజేపీ విష్ణువుడ**

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీని శివుడితో పోల్చారు. తనలో సగభాగాన్ని భార్యకు ఇచ్చిన శివుడు, నిరాడంబరంగా ఉంటారని గుర్తు చేశారు. అదే రకంగా కాంగ్రెస్ పద్ధతి సాధారణంగా ఉంటుందని తెలిపారు. అందుకు భిన్నంగా బీజేపీ విష్ణువులాగా నగలు నట్రాతో ఆడంబరంగా, అత్యంత విలాసంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. వాటిని కాపాడుకోవటానికే ఆ పార్టీ ప్రజల మీద ఆయుధా(అధికారం)న్ని ప్రయోగిస్తోందని ఎద్దేవా చేశారు.

**దేశం కోసం ప్రధాని అవుతా..**

కాగా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూడ రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆయన తాత నెహ్రూ, నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ ప్రధాని పదవిని చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు దేశాన్ని రక్షించేందుకు, విపత్కర పరిస్థితులనుంచి బయటపడేసేందుకు రాహుల్ గాంధీ కూడా పీఎం పదవిని చేపట్టాలని కోరారు. తాను ఓ ముఖ్యమంత్రిగా ఈ విజ్ఞప్తి చేయటం లేదని.. సాధారణ కాంగ్రెస్ కార్యకర్తగా అభ్యర్థిస్తున్నానని తెలిపారు. స్పందించిన రాహుల్ గాంధీ మోడీపై యుద్ధం చేసేందుకు ప్రధాని పదవిని చేపడతానని వ్యాఖ్యానించారు.

# హైడ్రా ఇళ్ల కూల్చివేతపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం

## హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోందని విమర్శలు

### పెద్దల ఇళ్లు హైడ్రాకు కనిపించడం లేదని ఆరోపణ

**మార్చి2ప్రజావినికిడి**

హైదరాబాద్ నగరంలో హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లను నిర్మిస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కూల్చివేత ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. హైడ్రాకు పెద్దవాళ్ల ఇళ్లు కనిపించడం లేదని ఆరోపించారు. కేవలం పేదల ఇళ్లు మాత్రమే కూల్చుతున్నారని అన్నారు.కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఎన్ని ఇళ్లను కూల్చివేశారో లెక్కలు తీయడానికి సిద్ధమా అని సవాల్ చేశారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలో భూదాన్ పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హిందూ సమాజం జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. హిందువులు రోడ్ల మీదకు వచ్చి కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మెడలు వంచాల్సిందేనని అన్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలాంటి దాడులను భరిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బొట్టు పెట్టుకుని దేవుడిని మొక్కడంతో సరిపోదని అన్నారు. దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు స్పందించని వాడు హిందువే కాదని బండి సంజయ్ అన్నారు.ముత్యాలమ్మ గుడి మీద దాడి చేసినా, మరే గుడిపై దాడి చేసినా స్పందించేది బజరంగ్ దళ్, హిందూవాహిని, హిందూ సంస్థలు, బీజేపీ మాత్రమే అన్నారు. కానీ సామాన్య హిందూ సమాజం ఇలాంటి దాడులను ఖండించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాన్సువాడలో అమాయకులైన హిందూ యువకులను అరెస్టు చేసి జైల్లో పెడితే వారి కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయని అన్నారు.చాంద్రాయణగుట్టలో చారిత్రాత్మక హనుమాన్ దేవాలయంపై దాడి జరిగితే కూడా హిందువులు బయటకు రావడం లేదని అన్నారు. ఇదేం పద్ధతి... హిందూ సమాజం ఇలాంటి దాడులను ఇంకా ఎన్నాళ్లు భరిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో అనేక దేవాలయాలపై దాడులు జరిగాయని అన్నారు. తాను ఇతర ప్రార్థనాలయాల గురించి మాట్లాడటం లేదని, కానీ హిందువుగా తమ దేవాలయంపై దాడి జరుగుతుంటే ప్రశ్నిస్తున్నానని అన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని హిందూ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారి అర్థం చేసుకోవాలని, దేవాలయాలపై దాడులు జరుగుతుంటే స్పందించాలని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం అన్ని పార్టీల జెండాలు పక్కన పెట్టి కేవలం కాషాయ జెండాను పట్టుకుని కొట్లాడుదామని పిలుపునిచ్చారు. బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని అన్నారు.

# రాజ్యసభకు మరో రెండురోజులే గడువు

మొదటిపేజీ తరువాయి

సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది. ‑ూజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదీ: మార్చి 5 కావడంతో ఎంపిక త్వరగా చేయాలని ఒత్తిడి పెంచారు.

మొదటిపేజీ తరువాయి

# ఏఐ కల్పిత తీర్పులతో జాగ్రత్త

దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. ఏఐ కల్పిత తీర్పులు సరైన న్యాయ ప్రమాణాలతో ఉన్నాయనే కారణంగా వాటిని ఉత్తర్వుల్లో ఉటంకించడాన్ని అనుమతిం చరాదని స్పష్టం చేసింది. ఏపీ హైకోర్టు ఓ కేసులో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశంపై సుప్రీంకోర్టు స్పందించింది. ఏపీ హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది. ఓ ఆస్తి వివాదంలో దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వాలంటూ ఏపీ హైకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలైంది. ఆ ఉత్తర్వులు ఇచ్చే సమయంలో దిగువ కోర్టు ఏఐ కల్పిత తీర్పులను తన ఉత్తర్వుల్లో పేర్కొందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. పిటిషన్‌లో లేవనెత్తిన అభ్యంతరాలను ఏపీ హైకోర్టు అంగీకరించింది. అయితే, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యానికి మాత్రం నిరాకరించింది. ఈ మేరకు గత ఏడాది ఆగస్టులో తీర్పును ఇచ్చింది. దీనిపై పిటిషనర్లు గత జనవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయ మూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ల వాదనను బెంచ్ అంగీకరించింది. పిటిషనర్ వ్యాజ్యాన్ని మరోసారి విచారించాలని, ఈసారి ఏఐ కల్పిత తీర్పులతో నిండిన అడ్వకేట్-కమిషనర్ నివేదికపై ఆధార పడొద్దని ఏపీ హైకోర్టును ఆదేశించింది. ఏఐ కల్పిత తీర్పుల విషయంలో చేపట్టాల్సిన చర్యలను సూచించాలంటూ సొలిసిటర్ జనరల్‌కు, భారత బార్ అసోసియేషన్‌కు బెంచ్ నోటీసులు జారీచేసింది.

# భారత్ శాంతి, సుస్థిరతలనే కోరుకుంటుంది

మాట్లాడారు. సౌదీపై జరిగిన దాడులను ఆయన ఖండించారు. భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతోనూ మోదీ ఫోన్‌లో మాట్లాడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో కూడా మోదీ ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. తమకు అండగా నిలిచిన స్నేహితుడు మోదీకి ధన్యవాదాలంటూ ఆయన భారతీయ మీడియా ప్రతినిధులతో అన్నారు.

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులను సురక్షితంగా తీసుకురావాలి: జగన్

అమరావతి, **మార్చి2ప్రజావినికిడి**

మధ్య ప్రాచ్య దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన ప్రవాసాంధ్రులను తక్షణమే సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని కోరారు. గల్ఫ్ దేశాల్లో ఏపీకి చెందిన వేలాది మంది ఉపాధి పొందుతున్నారని, ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల వారి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు.అక్కడ అనిశ్చితి నెలకొనడంతో పాటు పలు విమానాశ్రయాల్లో ఆంక్షలు, విమాన సర్వీసుల రద్దు కారణంగా చాలామంది ఎక్కడికక్కడ చిక్కుకుపోయిమధ్య ప్రాచ్య దేశాల్లో నెలకొన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరిపి, ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా తెలుగు వారందరినీ వెనక్కి రప్పించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, అక్కడి వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు వారి కుటుంబ సభ్యులకు తెలియజేసేందుకు రాష్ట్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రవాసాంధ్రుల భద్రత, వారి సురక్షిత ప్రయాణం ప్రభుత్వ బాధ్యతని, ఈ సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి సత్వరమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మైనింగ్ఇ-వేలంలో భారీగా అక్రమాలు

గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాకల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు.ప్రస్తుత వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర , పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితి లో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు.

# వేయికోట్లు వసూలుకు వచ్చారా

## రాహుల్ రాకపై కెటిఆర్ ఎద్దేవా

హైదరాబాద్, **మార్చి2ప్రజావినికిడి** లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.

----

# మూడోరోజూ భీకర పోరు

మొదటిపేజీ తరువాయి

అమెరికా, బహ్రైన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.పశ్చిమాసియాలో చెలరేగిన హింస రోజు రోజుకూ తీవ్రతరం అవుతోంది. ఇరాన్‌తో మొదలైన ఘర్షణ నాలుగు వారాల పాటు కొనసాగవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన నేప థ్యంలో పశ్చిమాసియా నగరాలలో నివసిస్తున్న భారతీయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక గల్ఫ్ దేశాలలో పరిమిత సంఖ్యలలో బేస్‌మెంట్ షెల్టర్లు, భవనాలలో బాంబు షెల్టర్లు ఉండడమే దీనికి కారణం. ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న దాడులకు ప్రతిగా వైమానిక దాడులు జరగవచ్చునంటూ గల్ఫ్ దేశాలలో సైరన్లను మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో గల్ఫ్‌లో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్న కేరళీయులు భయం భయంగా కాలం గడుపుతున్నారు.

**ఇరాన్‌లో వెయ్యికి పైగా లక్ష్యాలపై దాడులు**

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' సందర్భంగా కువైట్‌లో ముగ్గురు అమెరికా సైనికులు మరణించారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని పెంటగాన్ ధృవీకరించింది. లక్ష్యాన్ని సాధించేంత వరకూ పోరాటాన్ని ఆపేది లేదని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌లోని వెయ్యికి పైగా లక్ష్యాలపై అమెరికా సైన్యం దాడులు జరుపుతోంది. అటు ఇజ్రాయిల్ కూడా రాజధాని టెహ్రాన్‌లోని కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటోంది. అనేక చోట్ల పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. లెబనాన్ రాజధాని, హెజ్బొల్లాకు గట్టి పట్టున్న బీరూట్‌పై ఇజ్రాయిల్ రక్షణ దళాలు వైమానిక దాడులు ప్రారంభించాయి. మరోవైపు హెజ్బొల్లాతో నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో దక్షిణ లెబనాన్‌లోని పలు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించాలని ఇజ్రాయిల్ ఆదేశాలు జారీ చేసింది. తమపై దాడి చేస్తే ఊరుకునేది లేదని, ప్రతీకారం తప్పదని ఖతార్ హెచ్చరించింది. ఇరాన్ వైమానిక దాడుల కారణంగా బహ్రైన్, యూఏఈలోని అమెజాన్ క్లౌడ్ యూనిట్ల డేటా సెంటర్లలో విద్యుత్, కనెక్టివిటీ సమస్యలు తలెత్తాయి.

**ఆరు వేల విమాన సర్వీసులు రద్దు**

తన గగనతలాన్ని పాక్షికంగా, తాత్కాలికంగా మూసివేస్తున్నానని జోర్డాన్ ప్రకటించింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆరు వేలకు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. వీటిలో ఎమిరేట్స్, ఇతిహాద్, ఇండియో విమానాలు అధిక సంఖ్యలో ఉన్నాయి.


**నెతన్యాహూ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నాం : ఇరాన్ గార్డ్స్**

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయాన్ని, ఆ దేశ వైమానిక దళ కమాండర్ కేంద్ర కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులు చేస్తున్నామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపారు. కాగా ఇరాన్ దళాలు తమ విద్యుత్ కేంద్రంపై, ఓ ఇంధన స్థావరంపై దాడులు చేశాయని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ చెప్పింది. ఇదిలావుండగా ఇరాన్ రక్షణ మంత్రిగా రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ మజీద్ ఎబ్‌నెల్‌రెజాను దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ నియమించారు.

**ఇరాన్‌లో 555 మంది మృతి**

ఇజ్రాయిల్, అమెరికా దాడుల కారణంగా ఇప్పటి వరకూ 555 మంది చనిపోయారని ఇరాన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలియజేసింది. దేశంలోని 131 నగరాలపై దాడులు జరిగాయని వివరించింది. ఒక్క ఫార్స్ రాష్ట్రంలోనే 35 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుండగా కువైట్‌లో అమెరికాకు చెందిన అలీ అల్ సలేం వైమానిక స్థావరాన్ని, హిందూ మహా సముద్రంలోని నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని ఇరాన్ తెలిపింది. ఈ దాడులలో పదిహేను క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించామని చెప్పింది. సౌదీ అరేబియాలోని రాస్ తనూరా చమురు శుద్ధి కేంద్రంపై కూడా ఇరాన్ డ్రోన్ దాడి జరిపింది. టెల్ అవీవ్‌లోని ప్రభుత్వ భవనాల సముదాయం పైన, హైఫాలోని భద్రత-సైనిక కేంద్రాల పైన, తూర్పు జెరుసలేం పైన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దాడి చేశారు.

ఈ దాడులలో ఖైబార్ బాలిస్టిక్ క్షిపణులను ఉపయోగించారు. కువైట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో అక్కడ నివసిస్తున్న తన దేశీయులకు అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. ఇరాక్‌లో అమెరికా సైనికులు మకాం వేసిన ఎర్బిల్ విమానాశ్రయంపై ఇరాన్ మూడు డ్రోన్లను ప్రయోగించగా వాటిని కూల్చివేసినట్లు భద్రతా దళాలు తెలిపాయి. అమెరికా దళాలకు సాయం చేస్తే దాడులు తప్పవని సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రైన్ దేశాలను ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్‌పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఐరాస అణు ఏజెన్సీ ప్రతినిధులు వియన్నాలోని ఐఏఈఏలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అదే సమయంలో 35 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఏఈఏ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ కూడా భేటీ అయ్యారు.



**నాలుగైదు వారాలపాటు దాడులు : ట్రంప్**

అవసరమైతే ఇరాన్‌పై నాలుగైదు వారాల పాటు సైనిక దాడులు కొనసాగిం చాలని భావిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. సైనిక చర్యలను ఉధృతం చేయడం కష్టమేమీ కాదని అన్నారు. అయితే ఈ పోరులో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. వెనిజులా తరహాలో ఇరాన్‌లో అధికార మార్పిడి జరగాల్సి ఉన్నదని చెప్పారు. దాడులను కొనసాగించేందుకు తమ వద్ద అవసరమైన దళాలు, క్షిపణులు, ఆయుధ సామగ్రి అందుబాటులోనే ఉన్నాయని అంటూ యుద్ధం కొనసాగితే ప్రాణనష్టం పెరుగుతుందని తెలిపారు. ఇజ్రాయిల్, అమెరికా సేనలు ఇరాన్ నౌకా దళాన్ని దెబ్బ తీశాయని, తొమ్మిది నౌకలను, నౌకాదళ కార్యాలయాన్ని ధ్వంసం చేశాయని వివరించారు. ఇరాన్‌పై జరుపుతున్న దాడులకు గల్ఫ్ సాయం అవసరమని తాను భావించడం లేదని ట్రంప్ అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 3 మార్చి 2026

# ఆర్సిడో లారెల్ స్ప్రింగ్స్ వెంచర్ లో అలజడి..!






**షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంచర్ యజమాని**

**ఎన్నికల్లో ఓడిపోతే మా వ్యాపారులపై బల ప్రయోగమా..?**

**చటాన్ పల్లి కాంగ్రెస్ నాయకుడు రాజుగౌడ్ తదితరుల బ్లాక్ మెయిలింగ్**

**వెంచర్ యజమాని మిట్టపల్లి యాదగిరి తీవ్ర ఆరోపణలు**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఫిర్యాదు చేస్తా .. న్యాయం కోసం అడుగుతా..!**

**ఇవేం బెదిరింపులు.. ఇవేం రాజకీయాలు.. ఇదెక్కడి దుర్మార్గాలు..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
మున్సిపల్ ఎన్నికల వేడి ఇంకా "రాజు"కుంటుంది. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లి పరిధిలో గల ఆర్సిడో లారెల్ స్ప్రింగ్స్ వెంచర్ లో కొందరు దౌర్జన్యంగా వెంచర్ కాంపౌండ్ వాల్ ను ధ్వంసం చేసి భూమిని కబ్జా చేసి బోర్డు పాతారు. సదరు వెంచర్ లో అన్ని స్థలాలను విక్రయించి దాదాపు నాలుగైదు వేలు గడుస్తున్నప్పటికీ ఇప్పుడు కొత్తగా వచ్చి వెంచర్ లో స్థలం మాదేనని కుట్రపూరితంగా తన వెంచర్ కాంపౌండ్ వాల్ ను దోషం చేయడం దీని వెనుక రాజకీయాలు చోటుచేసుకున్నాయని వెంచర్ యజమాని మెట్టపల్లి యాదగిరి పేర్కొనడం, పోలీసులకు ఫిర్యాదు చేయడం లాంటి సంఘటన సంచలనమైంది.

### ఇక వివాదంలోకి వెళితే..

చటాన్ పల్లి పరిధిలోని "ఆర్సిడో" లారెల్ స్ప్రింగ్స్ వెంచర్ 2020 సంవత్సరంలో మిట్టపల్లి యాదగిరి తదితర భాగస్వాములు కలిసి దాదాపు 28 ఎకరాల్లో వెంచర్ చేశారు. హెచ్ఎండిఏ, రేరా ప్రభుత్వ అనుమతులు నిబంధనల ప్రకారం తీసుకొని దాదాపు నాలుగేళ్ల క్రితమే వెంచర్ లో ఇండ్ల స్థలాల అమ్మకాలు పూర్తి చేశారు.సర్వే నంబర్ 529పి, 530పి,534పి, 554పి,556పి, 557పి,558పిలో ఎల్ పి నెంబర్ 000052/ఎల్ఓ/2020 ప్రకారం హెచ్ఎండిఏ, రేరా అనుమతులతో నిబంధనల ప్రకారం వెంచర్ ఏర్పాటు చేశారు. అయితే వెంచర్ అయిపోయిన నాలుగైదు ఏళ్ల తర్వాత ఇప్పుడు కాంపౌండ్ వాల్ కూల్చడం వెనుక బ్లాక్మెయిలింగ్ చేస్తున్నారని వెంచర్ నిర్వాహకుడు మిట్టపల్లి యాదగిరి పోలీసులకు మీడియాకు ఫిర్యాదు చేస్తున్నారు.

## వెంచర్ కాంపౌండ్ వాల్ "ధ్వంసం"

### ఎన్నికలకు వ్యాపారస్తులకు ఏం సంబంధం..?

ఆర్సిడో లారెల్ స్ప్రింగ్స్ వెంచర్ నిర్వాకుడు మేట్టపల్లి యాదగిరి మీడియాకు ఫిర్యాదు చేశారు. వెంచర్ ప్రహరీ గోడను ఇన్నేళ్ల తర్వాత కూల్చడం వెనుక వారి దురుద్దేశం స్పష్టంగా ఉందని ఆరోపించారు. చటాన్ పల్లి ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇటీవలే కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి తనకు మూడు రోజుల క్రితం ఫోన్ చేశాడని వెంచర్ లో లోటుపాటు ఉన్నాయని చెప్పాడని అయితే తాను అవి ఏమిటో వచ్చి తెలుసుకుంటానని తాను వేరే ప్రాంతంలో చాలా దూరంలో ఉన్నానని చెప్పినట్లు వివరించారు. ఏదైనా విషయం ఉంటే మాట్లాడాలి లేదా మా దృష్టికి తీసుకురావాలి అంతేగాని కొంతమందిని తీసుకెళ్లి వెంచర్ లో దాష్టికానికి దిగి వెంచర్ ప్రహరీ గోడను కూలగొట్టడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. వెంచర్ లో తన భూమి ఉన్నట్లు చెబుతున్న బోడోల్ల శివకుమార్ కు సంబంధించిన స్థలం తన వెంచర్ లో ప్రహరీ గోడ వద్ద లేదని కావాలని అనవసరంగా వర్గం వ్యక్తుల కోట్లకు సంబంధించిన విషయంలో ఆ ప్రభావాన్ని తమ వెంచర్ పై చూపుతున్నారని నాకు స్థానిక రాజకీయాలకు ఏం సంబంధం అని తనది ప్రాంతం కాదని ఇక్కడ వ్యాపారం చేసుకుని ఏనాడో ఇండ్ల స్థలాలు చేసి విక్రయించానని పేర్కొన్నారు.
వెంచర్ లో ఆదివారం తన వెంచర్ కాంపౌండ్ వాల్ ను గుడాల భాస్కర్ గౌడ్ ఆదోని పల్లి రాజు గౌడ్ గుడాల శ్రీశైలం బోడోల్ల శివకుమార్ గంగపురి జంగయ్య గంగాపురి యాదయ్య కొండి అశోక్ బోడోల్ల రామకృష్ణ గుడిసె గిరి గంగపురి రమేష్ ఇంకా తదితరులు కలిసి వెంచర్ ప్రహరీ గోడను దగ్గరుండి ధ్వంసం చేయించి అక్రమంగా బోర్డు పాతారని వెంచర్నిర్వాహకుడు యాదగిరి పోలీసులకు తెలిపినట్టు వివరించారు.

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఫిర్యాదు చేస్తా..

రియల్ వ్యాపారస్తులపై రాజకీయ కారణాలను అడ్డం పెట్టుకుని కక్షపూరిత చర్యలకు దిగుతున్న ఆ పార్టీకి చెందిన రాజు గౌడ్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తానని వెంచర్నిర్వాహకుడు యాదగిరి తెలిపారు. ఇలాంటి వారితో పార్టీ అప్రతిష్టపాలు అవుతుందని అధికారం అడ్డం పెట్టుకుని ఇలా వ్యాపారస్తులపై దరిజనులు తెగిస్తే భరితగిస్తే సరికాదని ఎమ్మెల్యేకు వివరిస్తానని న్యాయం కోరతానని యాదగిరి తెలిపారు.

### బోడోల్ల శివకుమార్ ఏమన్నారంటే..

వెంచర్ వద్ద ప్రహరీ గోడను కూల్చిన అనంతరం అక్కడ మీడియాతో బోడోల్ల శివకుమార్ మాట్లాడుతూ,తన భూమి వెంచర్ లో ఉందని పలు సందర్భాల్లో యాదగిరి తో తన భూమి విషయమై మాట్లాడగా భూమి ఇస్తానని ఒప్పుకున్నాడని ఎన్నో ఏళ్ల సంది తనను వెంచర్ చుట్టూ తిప్పుకుంటున్నాడని శివకుమార్ మీడియా ముందు స్పష్టం చేశారు. పక్కనే చెరువు ఉందని నిబంధనలకు వ్యతిరేకంగా వెంచర్ నిర్మించాలని శివకుమార్ ఈ సందర్భంగా ఆరోపించడం గమనార్హం. తనకు సంబంధించిన ఐదు గుంటల స్థలంలో రెండున్నర గంటలు సెట్ బ్యాక్ అయ్యిందని, మిగతా స్థలం వెంచర్లో పోయిందని న్యాయం కోసం తిరిగి తిరిగి చివరకు విసిగి వేసారి కాంపౌండ్ వాల్ కూల్చి తానే స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బోడోల్ల శివకుమార్ మీడియాకు తెలిపారు. అదేవిధంగా తన పశు వులను మేపడానికి అక్కడికి వెళ్లాలని తనకు ఈ ఘటనకు సంబంధం లేదని కొన్ని అశోక్ అనే యువకుడు మీడియాకు ప్రకటన విడుదల చేశాడు.

## కుమ్మేలర ఘటనపై కలెక్టర్ నివేదిక

### బిసి కమిషన్‌కు సమర్పించినట్లు వెల్లడి

హైదరాబాద్, **మార్చి2ప్రజావినికిడి** తెలంగాణ బీసీ కమిషన్ గత నెల 23వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కుమ్మెర జాతర సంఘటనకై నివేదిక కోరడం జరిగింది. కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి 24వ తేదీన కుమ్మెర గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకోవడం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బధ్వావత్ సంతోష్ పంపిన తమ నివేదిక బీసీ కమిషన్‌కు చేరింది. అందులో పాప తండ్రి గణెళిష్‌కు డిస్టిక్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. పాప తండ్రి గణెళిష్‌కు నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో అవుట్‌సోర్సింగ్ జాబ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాప తండ్రి గణెళిష్‌కు 2 పడకల గదిని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ పాప కుటుంబంతో మాట్లాడి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ రిపోర్టులో 18వ తారిఖునాడు కుమ్మెర మల్లన్న జాతర నుండి 21వ తారీఖు వరకు జరిగిన అన్ని సంఘటనలను కూలంకుషంగా వివరించడం జరిగింది. 17 ఫిబ్రవరి నుండి 20 ఫిబ్రవరి వరకు ఆ జాతరలో సుమారు 20 వేల భక్తులు పాల్గొన్నారని తెలపడం జరిగింది. పాప తల్లి శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి ఆధారంగా ఆమె ఎటువంటి సర్టిఫికేట్లు ఇప్పటివరకు అందజేయలేదని తెలిపారు. శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి మహమ్మదాబాద్ తహశీల్‌దార్‌కు ఆదేశించగా మౌనిక తల్లి బాలక్రిష్ణమ్మ పిచ్చగుంట్ల (వంశరాజ్) కులానికి చెందినదని తెలపడం జరిగింది.

### ఎసిబికి చిక్కిన జూనియర్ అసిస్టెంట్



మేడ్చల్, **మార్చి2ప్రజావినికిడి** మేడ్చల్ జిల్లా కుతుబుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణెష్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం తహసీల్ కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుడికి జూనియర్ అసిస్టెంట్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో మొదటి విడతగా రూ.5 వేలు తీసుకోగా చివరి విడతగా సోమవార రూ.15 వేలు లంచం తీసుకుంటూ సిటీ రేంజ్ వన్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

## ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్ట కట్టలేదు :నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

### పెన్షనర్ల రిటైడ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల రిటైడ్ బెనిఫిట్స్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించలి





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్ర రాజధాని ఇంద్రాపార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్ల, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన మహా ధర్నాలో బీజేపీ నేతలు,విశ్రాంత ఉద్యోగులు భారీగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి కామారెడ్డి శాసనసభ్యులు కాటేపల్లి వెంకట రమణ రెడ్డి స్వయంగా దీక్షలో కూర్చొన్నారు.
ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు పాల్గొన్నారు. ధర్నాలో ఏ.మహేశ్వర్ రెడ్డి(బీజేపీ ఫ్లోర్ లీడర్),ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎంఎల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి,నేతలు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి,విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ,ఉపాధ్యాయ వర్గాలకు అన్యాయం జరిగితే స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్ర మాజీ సీఎం కె.చంద్రశేఖర రావు ప్రభుత్వం 317 వంటి జీఓలను తీసుకువచ్చి అన్యాయం చేసిందని విమర్శించారు.
ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందని ఆశించిన ఉద్యోగులు,రెండు సంవత్సరాలుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలువురు మానసిక ఒత్తిడితో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు.
ప్రభుత్వ ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం చాలా కాలం నిలువలేదు"ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్ట కట్టలేదు" అని హెచ్చరించిన ఆయన,రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని,పీఆర్సీ అమలు చేయాలని, ఉద్యోగులు దాచుకున్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకుల కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తూ రిటైర్డ్ ఉద్యోగులకు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.
ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధన వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

# షాద్ నగర్ పట్టణంలో ఘనంగా మున్నూరు కాపు సంఘం మహిళల సమ్మేళనం



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సదుద్దేశంతో సోమవారం రోజు షాద్ నగర్ పట్టణంలోని సాయిరాజా కన్వెన్షన్ హాల్ లో మున్నూరు కాపు మహిళా సమ్మేళనం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం షాద్ నగర్ తాలూకా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని అన్ని వార్డులనుంచి మున్నూరు కాపు మహిళా మణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎవరికి ఎలాంటి అవసరం ఉన్న విద్య పరంగా,వైద్య పరంగా,వ్యాపార పరంగా,ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్న అందరం కలిసిమెలిసి ఉంటూ సమైక్యంగా ముందుండి సమస్యల పరిష్కారమే కృషిగా కలిసి సాగుదామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.



# ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా కరుణాకర్

**ప్రజావినికిడి,(షాద్ నగర్):** పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల నూతన రాష్ట్ర కార్యవర్గంలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, తెలంగాణ ఉద్యమకారుడు కరుణాకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల నూతన రాష్ట్రస్థాయి కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కరుణాకర్ ఎంపిక కావడం విశేషం. తెలంగాణ ఉద్యమకారుడిగా ఎంతో ప్రస్థానం ఉన్న కరుణాకర్ ఉద్యమ జేఏసీలో కీలకంగా వ్యవహరిస్తున్నారుఅదేవిధంగా ప్రైవేట్ కళాశాలల రంగంలో విద్యావేత్తగా అపార అనుభవం ఉంది. ఒకవైపు విద్యాపరంగా మరోవైపు రాజకీయ రంగంలో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్న కరుణాకర్ రాష్ట్రస్థాయిలో కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఎల్బీనగర్ జోన్ జాయింట్ కమిషనర్ క్రిష్ణ కుమారి కి ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్న గట్ల రవీంద్ర



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** వీధి వ్యాపారులు వందల సంఖ్యలో రోడ్లపై తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల సర్వీస్ రోడ్డు పూర్తిగా రద్దీగా మారాయని కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర నాయకుడు గట్ట రవీంద్ర (హైటెక్ రాము)పేర్కొన్నారు. ఆర్కే పురం డివిజన్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ నుంచి చైతన్యపురి వరకు ఉన్న సర్వీస్ రోడ్డు ఇరుపకళ తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని సోమవారం ఎల్బీనగర్ జోన్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కృష్ణకుమారి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 9వ తేదీన కూడా సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ కు కూడా ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు అన్నారు. సర్వీస్ రోడ్డుతో పాటు నాగోలు కొత్తపేట మహాలక్ష్మి, ఓమ్ని ఆసుపత్రి రోడ్డులో తెల్లవారుజాము నుంచి ఉదయం 9:30 గంటల వరకు వందలాది పండ్ల వాహనాలు రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల కోసం వెళుతున్న విద్యార్థులకు మహాలక్ష్మి థియేటర్,ఓమ్ని ఆసుపత్రి,బి జె ఆర్ భవన్, చైతన్యపురి, సర్వీస్ రోడ్ల వద్ద తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. పండ్ల వ్యాపారుల వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో ఇంటర్ విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోతున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడిరోడ్డుపై ప్రతిరోజు కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్న వాహనాలు, వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజావాణిలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

## క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత

హైదరాబాద్, **మార్చి2ప్రజావినికిడి**

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ – 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

# గ్రేటర్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: గంట శ్రవణ్ కుమార్

## పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ చేసిన గంట శ్రవణ్ కుమార్ -ఘనంగా జక్కిడి శివచరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గంట శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా గంట శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి జక్కిడి శివచరణ్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని



కొనియాడారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బల్దియాపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జక్కిడి శివచరణ్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేయడంతో గంటా శ్రావణ్ కుమార్ ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బబ్బూరు పృథ్వీగౌడ్, నాయకులు జక్కిడి సత్యతేజరెడ్డి, వినోద్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, విఠల్ రెడ్డి,బోనం రఘుపతి, మున్నా,విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా శ్రీపాద.

## బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షులు పోచంపల్లి రమణారావు



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
తెలుగు రాజకీయాల్లో దుద్దిల్ల శ్రీపాదరావుది ప్రత్యేకమైన చరిత్ర అని ఆయన వ్యక్తిత్వమే ప్రజలకు దగ్గర చేసిందని ఇప్పటికీ జనం గుండెల్లో నిలిచేలా చేసిందని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షులు పోచంపల్లి రమణారావు అన్నారు. సోమవారం నాడు కొత్తపేట లోని ఆర్కే పురంలో భావన రెసిడెన్సి లో శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా, ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ స్థాయి నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభ పతి వరకు ఎదిగారని న్యాయవాదిగా అనేక సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ తలాటి రమేష్ నేత మాట్లాడుతూ,ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన శ్రీపాదరావు బాల్యమంతా పల్లెటూర్లో గడిచిందని తల్లిదండ్రులను రాధాకృష్ణయ్య కమలాబాయి ఇచ్చిన విలువలు ఆయన ప్రస్థానానికి పునాదిరాళ్లు అయ్యాయని చిన్ననాటి నుండి చదువులో చురుకుగా ఉండే ఆయన ధన్వాడలో ప్రాథమిక విద్య మంథనిలో ఎస్ఎస్సి పూర్తి చేశారని అన్నారు. ఉన్నత విద్య కోసం హైదరాబాదుకు వచ్చారని ఆ తరువాత ఆదిలాబాద్ లో పంచాయతీ ఇన్స్పెక్టర్గా పనిచేశారని దీనితో ఆయనకు గ్రామ పరిపాలనపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది అన్నారు. అనంతరం నాగపూర్ లో న్యాయ శాస్త్రం చదివి న్యాయవాదిగా సేవలు అందించారని వ్యవసాయం చేస్తూ రాజకీయాల్లోకి తండ్రి మరణం తర్వాత శ్రీపాదన స్వగ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం చేశారని ఆ వ్యవసాయమే ఆయన జీవితాన్ని మలుపు తెప్పిందని వరుసగా రెండుసార్లు గ్రామ సర్పంచిగా ఎన్నికైన మహదేవ్ పూర్ సమితి అధ్యక్షుడిగా మంథని ల్యాండ్ మార్ట్ గేజ్ బ్యాంకు చైర్మన్ గా పని చేశారని అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కానాల శ్యాంసుందర్రావు మాట్లాడుతూ, 1983లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం మధ్య కాంగ్రెస్ అభ్యర్థిగా మంథని నుంచి పోటీ చేసి విజయం సాధించడం సాధారణ విషయం కాదని ప్రజల విశ్వాసం ఆయనకు రాజకీయ బలంగా మారింది అని మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధత తో కృషి చేసిన ఘనత ఆయనకు దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కోశాధికారి గూడా రాజేశ్వరరావు ప్రచార కార్యదర్శి గూడా జయరాం సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్ ఆర్ బి రాములు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డిఅన్నారం ప్రజల ముంపు సమస్య తీరుస్తా..

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
ఒకరి సౌకర్యం కోసం మరొకరిని అసౌకర్యానికి గురి చేయొద్దు,గడ్డిఅన్నారం ప్రజల ముంపు సమస్య పరిష్కారానికి అండగా నిలుస్తా.. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరామ్ నగర్,తిరుమల నగర్,వివేకానంద నగర్,కమలా నగర్ కాలనీల ప్రజలు ఎల్బీనగర్ నుండి సరూర్ నగర్ చెరువు వద్దకు నిర్మిస్తున్న స్టార్మ్ వాటర్ లైన్ అలాగే అవుట్‌లెట్ పనుల కారణంగా భవిష్యత్తులో మళ్లీ ముంపు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గడ్డిఅన్నారం ప్రాంతానికి ఎటువంటి ముంపు రాకుండా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యపై పూర్తి అవగాహన కోసం సరూర్ నగర్ ప్రియదర్శిని పార్కు వద్ద జరుగుతున్న అవుట్‌లెట్ పనులను పరిశీలించారు. గతంలో శాతవాహన నగర్, కాకతీయ నగర్, సౌభాగ్య నగర్, అధికారి నగర్, ధర్మపురి కాలనీ, సాయి నగర్ ప్రాంతాలు వర్షాకాలంలో వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవని గుర్తుచేశారు. ఆ సమస్యల నివారణ కోసం బాక్స్ డ్రెయిన్ నిర్మించి తపోవన్ కాలనీ మీదుగా సరూర్ నగర్ చెరువులో కలపడం జరిగిందని తెలిపారు. అలాగే ఎల్బీనగర్ నుండి సరూర్ నగర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (యు జి డి ) లైన్ ప్రతిపాదించి, ఆ లైన్‌ను ఎస్టీపీ (ఎస్ టి పి) లో కలిపి శుద్ధి చేసిన నీటిని చెరువులోకి విడుదల చేసే విధంగా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ డ్రైనేజ్ లైన్‌ను స్టార్మ్ వాటర్ లైన్‌గా మార్చి,ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా అవుట్‌లెట్ వద్ద కలపడం వల్ల గడ్డిఅన్నారం ప్రాంతం మళ్లీ ముంపుకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని వృథా చేస్తూ తాత్కాలిక నిర్ణయాలతో పనులు చేపట్టడం సరికాదని, ప్రజల ఆస్తులు అదేవిదంగా ప్రాణాలకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. స్థానిక ప్రజలకు హామీ ఇస్తూ, పైప్‌లైన్‌ను ప్రస్తుత ప్రణాళిక ప్రకారం కాకుండా ఎస్టీపీలో కలిపేలా అధికారులతో మాట్లాడి మార్పులు చేయించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,రమణా రెడ్డి,సుదీర్ గౌడ్, యాదా శంకర్, నాగిరెడ్డి,రాము, చంద్రారెడ్డి, రాజశేఖర్,శ్రావణ్, ప్రవీణ్,సుధాకర్, రాజయ్య తదితరులు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రగళ్లపల్లిలో రక్తదాన శిబిరం

**ప్రజావినికిడి ,(వాజేడు):**
ప్రగళ్లపల్లి గ్రామంలో చేయూత స్వచ్ఛంద స్వంస్థ, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్, దూలపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్,బాలకృష్ణ, ఫారెస్ట్ సిబ్బంది,ప్రగళ్లపల్లి యూత్, గ్రామస్థులు సహకారంతో రెడ్ క్రాస్ సొసైట్ వారికి 25 యూనిట్స్ బ్లడ్ అందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం కు ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బడే నాగజ్యోతి,ముఖ్య అతిధిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో నాగజ్యోతి మాట్లాడుతు స్వచ్ఛంద సేవ సంస్థ,మదర్ థెరిసా ట్రస్ట్ దూలపురం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో మందికి అండగా నిలుస్తూ అత్యవసర పరిస్థితులలోప్రాణాలు కాపాడే ప్రయత్నానికి దోహదపడుతుందిరక్తదానం,



ప్రాణదానం,అని ఈ కార్యక్రమం లో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ మడకం సుభద్ర, మాజీ సర్పంచ్ పూసం నరేష్ కుమార్,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ సంతోష్,ఆదిలక్ష్మి, లలిత, దూలపురం



ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది,మదర్ థెరిసా ట్రస్ట్ కొప్పుల మురళి,గ్రామస్తులు భాను ప్రకాష్, మాణికుమార్, రక్షిత్,వేణు, రామకృష్ణ,అనిల్, మాధవ్,నరేష్, దిలీప్, గాంధీ,ప్రశాంత్,జగదీష్,జనార్దన్,రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మూసీపై బిఆర్ఎస్, బిజెపిల గోల

### గుజరాత్ వెళ్లి వివరాలు తెలుసుకోవాలి

### మండిపడ్డ మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, **మార్చి2ప్రజావినికిడి :** హైదరాబాద్ నగరంలో మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నీటిని తెచ్చి కలపాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే భాజపా, భారాసలు అడ్డుపడుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. మూసీ ప్రక్షాళనతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సబర్మతి నది ప్రక్షాళనకు, మూసీ ప్రక్షాళనతో సంబంధం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అంటున్నారని, ఆయన మాటలన్నీ అవాస్తవాలని తమ పరిశీలనలో తేలిందన్నారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదిని 22 కిలోమీటర్ల దూరం ప్రక్షాళన చేయడానికి గుజరాత్ ప్రభుత్వం పది వేలమందిని తరలించినట్లు అక్కడి అధికారులే స్వయంగా చెప్పారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఆయన సబర్మతి రివర్ ఫ్రంట్‌ను సందర్శించారు.

అలగే విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిలతో కలిసి ఆనంద్ అమూల్ పాల కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబర్మతి నీటిని ప్రక్షాళన చేసి పంటలకు అందిస్తున్నారని తెలిపారు. సబర్మతికి నీళ్లు నర్మదా నది నుంచి వస్తుంటే మూసీకి గోదావరి నుంచి తేవాలనేది రాష్ట్రప్రభుత్వ సంకల్పమని వివరించారు. సబర్మతి ప్రక్షాళనకు 2004 నుంచి 2014 వరకు 10 వేల మందిని తరలించినట్లు గుజరాత్ అధికారులు చెప్పారని, కానీ ఎవరినీ తరలించలేదని రామచందర్‌రావు అబద్దాలాడుతున్నారని శ్రీహరి మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన చేపట్టకుండా.. మురికికూపంలోనే బతుకుదామా అని ప్రశ్నించారు. రేవంత్‌మూసీ ప్రక్షాళన చేస్తే ఎప్పటికీ సీఎంగా ఉండిపోతారని భయపడి భాజపా, భారాస నేతలు వ్యతిరేకిస్తున్నారని చామల చెప్పారు. హరీశ్, రామచందర్‌రావు సబర్మతి ప్రక్షాళన జరిగిన తీరుచూసి మాట్లాడాలన్నారు. అలాగే గుజరాత్ తరహాలో తెలంగాణలో పాడి రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రైతులకు ఆదాయం, మహిళలకు ఆర్థిక సాధికారత, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శ్రీహరి తెలిపారు. మంత్రి తదితరులు ఆదివారం గుజరాత్‌లోని అమూల్ పాల ఉత్పత్తి ప్లాంటును సందర్శించారు.

---------------

## క్యాతన్‌పల్లి కేసులో బాల్క సుమన్‌కు బెయిల్



మంచిర్యాల **మార్చి2ప్రజావినికిడి** ): క్యాతన్‌పల్లి కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది. గత 15 రోజులుగా ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ అగ్ర నాయకులు పరామర్శించి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందింది. అయితే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ అడ్డుకుని చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు మరో 20 మందిపై అక్రమ కేసులు బనాయించి జైలులో బంధించింది.

-----

## లక్ష్మీదేవిపల్లి రైతుల ఆందోళన

సిద్దిపేట, **మార్చి2ప్రజావినికిడి** సమస్యల పరిష్కారానికి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో అన్నదాతలు రోడ్డెక్కారు. సిద్దిపేట – ముస్తాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. అలాగే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ద్వారా సాగుకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ ధర్నాలో నారాయణపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు రైతులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు.

---------

# చమురు ట్యాంకర్‌పై దాడి

### భారతీయ సిబ్బంది ఒకరు మృతి

న్యూఢిల్లీ, **మార్చి2ప్రజావినికిడి** గల్ఫ్ ఆఫ్ ఒమన్ లో ఓ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగింది. డ్రోన్ బోట్‌తో ఈ దాడికి పాల్పడినట్లు ఒమన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో నౌకలోని సిబ్బందిలో ఒకరు మృతిచెందారు. ఆ వ్యక్తి భారతీయుడని తెలిసింది. దాడికి గురైన నౌకను ఎంకేడీ వ్యోమ్‌గా గుర్తించారు. దీనిపై మార్షల్ ఐలాండ్స్ జెండా ఉంది. ఒమన్ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌకపై దాడి జరిగిందని ఒమన్ మీడియా వెల్లడించింది. ఈ ఘటన కారణంగా నౌకలో భారీ పేలుడు సంభవించింది. ప్రధాన ఇంజిన్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.దీంతో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు ఒమన్ తెలిపింది. దాడి సమయంలో నౌకలో 59,463 మెట్రిక్ టన్నుల చమురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ దాడి ఎవరు చేశారన్న దానిపై స్పష్టత లేదు. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడుల వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.నౌకలోని మిగతా 21 మంది సిబ్బందిని రక్షించి మరో కమర్షియల్ ఓడలోకి తరలించారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీలు, ఒక ఉక్రెయిన్ జాతీయుడు ఉన్నారు. దాడి నేపథ్యంలో గల్ఫ్ ఆఫ్ ఒమన్ మీదుగా ప్రయాణించే నౌకలకు ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ అలర్ట్ జారీ చేసింది.

-------------

## ఫిర్యాదుదారుడి పట్ల కలెక్టర్ ఉదారత

### చేతికి గాయం చూసి వైద్య సాయానికి ఆదేశం

జనగామ, **మార్చి2ప్రజావినికిడి**

జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తొలి సారి నిర్వహించిన ప్రజావాణిలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చెరుకు సోమనర్సయ్య తన భూ సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి రాగా అర్జీదారుడి చేతిపై దురదతో వాపు ఉండడాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ గమనించారు. చేతికి ఏమైందని బాధితుడిని కలెక్టర్ అడగ్గా మూడు రోజుల క్రితం చేతిపై జెర్రి పాకిందని సోమనర్సయ తెలుపడంతో అతడిని వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు పంపించాలని డీఎంహెచ్ వోను ఆదేశించారు.

బాధితుడికి ఒక వ్యక్తిని సహాయంగా హాస్పిటల్‌కు పంపించి చికిత్సను అందించారు. డాక్టర్ల సూచన మేరకు అవసరమైన మందులు తీసుకున్న బాధితుడు ఆ తర్వాత మళ్లీ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వైద్య సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత సదరు బాధితుడు వచ్చిన భూ సమస్య పై కలెక్టర్ కు అర్జీ సమర్పించి వెళ్లాడు. ఇంట్లోవారి ఆరోగ్య సమస్యల గురించి కుటుంబ సభ్యులే సరిగా పట్టించుకోని ఈ కాలంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించిన తీరును పలువురు ప్రశంసించారు.

-------------

# మహిళా సమైక్య భవనానికి ఘనంగా భూమి పూజ





**అనంతగిరి: మార్చి2ప్రజావినికిడి**
మండల పరిధిలోని పాలవరం చనుపల్లి గ్రామంలో మహిళల సాధికారతకు మరో అడుగు పడింది. స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి సోమవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరి సింగ్ నాయక్, పాలవరం సర్పంచ్ నరేష్ గౌడ్ చనుపల్లి సర్పంచ్ నల్ల భూపాల్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు...ఈ సందర్భంగా ఎంపీడీవో హరి సింగ్ నాయక్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి గ్రామ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో దోహదపడుతుందని తెలిపారు.మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ గ్రామంలో మహిళల కోసం ప్రత్యేక భవనం నిర్మాణం చేయడం గర్వకారణమని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి వివోఏలు సంఘ బంధం అధ్యక్షులు మహిళా సంఘాల సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

అమరావతి **మార్చి2ప్రజావినికిడి**
స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి
వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.



### గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి:

#### అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు.

యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే గుర్తించి సహాయం అందించాలన్నారు. ఆయా దేశాల్లోని భారతీయ ఎంబసీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్టీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, విమానాశ్రయాలు తిరిగి తెరుచుకుని సర్వీసులు ప్రారంభమయ్యే వరకు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా అవసరమైన వారికి తాత్కాలిక వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాధితుల కోసం ప్రభుత్వం 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది.

హెల్ప్‌లైన్ నెంబర్లు:
ఫోన్: 0863–2340678
వాట్సాప్: 85000 27678
అలాగే helpline@apnrts.com, info@apnrts.com ఈమెయిల్స్ ద్వారా లేదా https://apnrts.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సంప్రదించి తక్షణ సహాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# ఏపీ టీచర్లకు కొత్త అటెండెన్స్ రూల్స్..


### ఇక నిమిషం ఆలస్యమైనా 'లేట్'

**ఉదయం 9 గంటలలోపు పాఠశాలలకు హాజరు తప్పనిసరి**

**హాఫ్-డే లీవులు, ఔట్-టైమ్‌పైనా కఠినమైన రూల్స్ జారీ**

**నిమిషం ఆలస్యమైనా సెలవుగా పరిగణిస్తామని హెచ్చరిక**

**కొత్త నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు**



అమరావతి, **మార్చి2ప్రజావినికిడి**
ఏపీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కొత్త, కఠినమైన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. క్రమశిక్షణ, సమయపాలనను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇకపై ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం 9 గంటలలోపు పాఠశాలలకు
తప్పనిసరిగా చేరుకోవాలని స్పష్టం చేసింది. ఆ సమయం తర్వాత హాజరు నమోదు చేస్తే దానిని 'లేట్ ఇన్'గా పరిగణిస్తారు.కొత్త నిబంధనల ప్రకారం నెలలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ (వెసులుబాటు సమయం) ఉంటుంది. ఇక హాఫ్–డే సెలవు తీసుకునే వారికి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఉదయం సెలవు పెట్టి మధ్యాహ్నం విధులకు హాజరయ్యేవారు ఒంటి గంట లోపు హాజరు నమోదు చేయాలి. ఆ తర్వాత వస్తే 'లేట్ ఇన్'గా లెక్కిస్తారు. అలాగే ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నం సెలవు పెట్టేవారు 12:30 గంటల కంటే ముందు 'ఔట్ టైమ్' నమోదు చేయకూడదు.పాఠశాల ముగిసే సమయానికి సంబంధించి కూడా నిబంధనలను కఠినతరం చేశారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సాయంత్రం 3:30 గంటల కంటే ఒక్క నిమిషం ముందు ఔట్ టైమ్ నమోదు చేసినా, ఉన్నత పాఠశాలల టీచర్లు సాయంత్రం 4 గంటల కంటే ముందు నమోదు చేసినా దానిని 'ఎర్లీ ఔట్'గా పరిగణిస్తారు. ముఖ్యంగా ఉదయం ఇన్–టైమ్ నమోదు చేసి, సాయంత్రం ఔట్–టైమ్ నమోదు చేయడం మరిచిపోతే, వారు ఆ రోజంతా గైర్హాజరైనట్లే లెక్క. అంటే ఉదయం వచ్చిన వెంటనే వెళ్లిపోయినట్లుగా భావిస్తారు:పాఠశాల విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా పరిగణించడం సరికాదని అభిప్రాయపడింది. గతంలో ఉన్న 10 నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేసింది. హాజరు నమోదు చేసే యాప్ కొన్నిసార్లు సరిగా పనిచేయదని, అటువంటి సాంకేతిక సమస్యలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం అన్యాయమని పేర్కొంది. ప్రభుత్వం తమను "ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ"గా చెప్పుకుంటూ ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడం విరుద్ధమని సంఘం నేతలు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలపై పునరాలోచిస్తుందా? లేక యథాతథంగా అమలు చేస్తుందా? అనేది వేచి చూడాలి.

# దర్యాప్తు అధికారి ముందు హాజరు కండి

### రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

### ఐపిఎస్ నాయక్‌కు హైకోర్టు ఆదేశం




అమరావతి **మార్చి2ప్రజావినికిడి**
ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారి ముందు హాజరు కావాలని బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్‌ను హైకోర్టు ఆదేశించింది. మార్చి 5వ తేదీ లేదా అంతకంటే ముందు దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని జారీ చేసిన ఆ ఆదేశాల్లో నాయక్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి కఠిన చర్యలకు పాల్పడకుండా చట్టంలోని నిబంధనలను లోబడి సునీల్ కుమార్ నాయక్‌ను విచారించాలని దర్యాప్తు అధికారికి ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు సూచించింది. ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు పై విధంగా స్పందించింది. ఇక మార్చి 9వ తేదీకి సునీల్ కుమార్ ప్రధాన బెయిల్ పిటిషన్ విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా రాజకీయ కారణాలతో తన పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారంటూ సునీల్ తరఫు సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదనలు వినిపించారు. ఈ కస్టోడియల్ టార్చర్‌తో సునీల్ నాయక్‌కు సంబంధం లేదని కోర్టు దృష్టికి ఈ సందర్భంగా పరమేశ్వర్ తీసుకెళ్లారు. ఇంకోవైపు సునీల్ నాయక్ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్ద్ లూథ్రా కోర్టుకు వివరించారు. అలాగే సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌ను గుంటూరు కోర్టు గతంలో కొట్టి వేసిందంటూ హైకోర్టు దృష్టికి సిద్దార్థ్ లూథ్రా తీసుకెళ్లారు. పోలీసుల మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేరు లేదనే కారణంతో పిటిషనర్ దర్యాప్తు నుంచి తప్పించుకోలేరని హైకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్‌లో అందరి నిందితుల పేర్లు చేర్చాల్సిన అవసరం లేదని.. ఈ కేసు దర్యాప్తు సాగుతున్నకొద్ది మరికొంతమంది నిందితులను చేర్చే అవకాశం ఉంటుందని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తునకు సహకరించాల్సిన చట్టబద్దమైన విధి పిటిషనర్‌కు ఉందని హైకోర్టు తెలిపింది.

# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

**మార్చి2ప్రజావినికిడి**

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకో వడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా



ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్గాన్తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హొసేన్ మొహ్సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తరిఉగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.

## స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

### తీవ్రంగా నష్టపోయిన సూచీలు

ముంబయి, **మార్చి2ప్రజావినికిడి** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు రేట్ల పెరుగుదలతో సూచీలు దారుణంగా పడిపోయాయి. సెన్సెక్స్ 1000 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 300 పాయింట్ల మేర పడిపోయింది. సోమవారం ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారింది. దీంతో 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గింది. దీంతో 91.32గా ట్రేడ్ అవుతోంది. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందారు. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నప్పటికీ నష్టాల్లో కొనసాగుతున్నాయి.ఇరాన్-అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రేట్లు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైగా ట్రేడ్ అవుతోంది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు బాగా పడిపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5 శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.


## ఇరాన్ దాడులతో బిక్కుబిక్కుమంటన్న దుబాయ్

### వరుస డ్రోన్ దాడులతో ప్రజల్లో భయాందోళనలు

అబుదాబి, **మార్చి2ప్రజావినికిడి**

పర్యాటకులు, ధనవంతులు, వ్యాపారాలకు స్వర్గధామంగా గుర్తింపు పొందిన దుబాయి నగరం ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిపోయింది. శనివారం నుంచి క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు చేస్తున్న ఇరాన్.. ఆదివారం కూడా దాడి చేసింది. ఈ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని దుబాయి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిత్యం ప్రశాంతంగా ఉండే నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు, మంటలు, ఆకాశంలోకి లేస్తున్న దట్టమైన పొగ.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. చాలామంది స్థానికులు, పర్యాటకులు దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని చెప్పారు. ముందుజాగ్రత్తగా ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లన్నింటినీ కూల్చివేశామని ప్రకటించింది.

అయితే, జెబెల్ అలీ పోర్టు సమీపంలో ఇరాన్ ప్రయోగించిన ఓ డ్రోన్ పడి భారీగా మంటలు చెలరేగాయి. దుబాయి గగన రక్షణ వ్యవస్థ కూల్చివేసిన ఇరాన్ డ్రోన్ శకలాలు పడటంతో పామ్ హోటల్‌లో



స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని, వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇరాన్ దాడితో దుబాయిలోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందిన బుర్జ్ ఖలీఫా, బుర్జ్ అల్ అరబ్‌లకు ముప్పు ఏర్పడింది. శనివారం రాత్రి ఇరాన్ డ్రోన్ శకలాలు బుర్జ్ అల్ అరబ్ భవనాన్ని తాకటంతో అది స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తగా ఈ రెండు భవనాలను అధికారులు ఖాళీ చేయించారు. ఆదివారం తెల్లవారుజామున మూడు భారీ పేలుళ్లు వినిపించాయని స్థానికులు చెప్పారు. కృత్రిమంగా సృష్టించిన విలాసవంతమైన పామ్ జుమైరా దీవిలో కూడా డ్రోన్ పడటంతో మంటలు చెలరేగాయి. కాగా, నగరంలో పరిస్థితి అంతా మామూలుగానే ఉందని దుబాయి మీడియా కార్యాలయం ప్రకటించింది. అత్యవసర వైద్యసేవల కోసం దుబాయిలో 1,200 పడకల రషీద్ ప్రభుత్వాసుపత్రిని సిద్ధం చేసినట్లు అక్కడ సేవలందిస్తున్న ఓ భారతీయ వైద్యుడు చెప్పారు. 400మంది నర్సింగ్ సిబ్బంది, 200మందికిపైగా వైద్యులను ఉంచినట్లు తెలిపారు. నగరంలో వందలకొద్ది అంబులెన్సులను సిద్ధంగా ఉంచారని అన్నారు. దుబాయిలో పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ఆదివారం మధ్యాహ్నానికి పేలుళ్లు పెరిగాయి. అయినా పరిస్థితి అదుపులోనే ఉంది. సామాన్య జనజీవనానికి పెద్దగా అంతరాయాలు ఏమీ లేవు. ఇళ్లకే పరిమితమయ్యాం. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతున్నా, ఇక్కడి ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉంది. యూఏఈ ఇప్పటికే ఎన్నో జాగ్రత్త చర్యలు చేపట్టింది.

## విభిన్నంగా గిరిజనుల హోలీ జాతర

విజయనగరం, **మార్చి2ప్రజావినికిడి్):** చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రం బీటాలైన్‌లో గల రాధాకృష్ణుల ఆలయం హోలీ జాతరకు ముస్తాబయింది. ఇక్కడ ఏటా హోలీని విభిన్నంగా జరుపు కుంటారు. తాజంగి పంచాయతీ బీటాలైన్‌లో ఒడిశా నుంచి వలస వచ్చిన 300 కుటుంబాల ఆదివాసీలు సుమారు 85 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. స్థానిక గిరిజనులు గ్రామంలో రాధాకృష్ణుల ఆలయాన్ని నిర్మించి ప్రతి ఏటా హోలీ రోజున పండుగ జరుపుకుంటున్నారు. ఆదివాసీలు ప్రతీ ఏడాది హోలీకి ముందు రోజు నుంచి స్థానిక రాధాకృష్ణుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. హోలీని పురస్కరించుకుని సంప్రదాయంగా భక్తులు




ఆలయం ఎదుట 70 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన కర్రల పోగును మంగళవారం కాలుస్తారు. ఆ వేడుకలో స్వయంగా పాల్గొనేందుకు పలు గిరిజన గ్రామాలు, మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆరేళ్ల క్రితం ఆలయాన్ని ఆధునికీకరించారు. అయితే బీటాలైన్ ఆదివాసీలు విభిన్నంగా జరుపుకునే హోలీ వేడుక పూర్వం నుంచి కొనసాగుతున్నది. ఈ ఏడాది హోలీ వేడుకలకు రాధాకృష్ణుల ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం రాత్రి భక్తుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు హోలీ సంబరం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కర్రల పోగును కాల్చే వేడుకను నిర్వహిస్తారు. ఇప్పటికే స్థానిక భక్తులు 70 అడుగుల కర్రల పోగును సిద్ధం చేశారు. ఈ కర్రల పోగును మంగళవారం ఉదయం ఐదు గంటలకు కాలుస్తారు. ఈ కర్రల పోగుపైన ఒక జెండాను తాడుతో ఎగురవేస్తారు. ఈజెండాను పట్టుకోవడానికి కర్రల పోగు చుట్టూ యువ భక్తులు నిరీక్షిస్తుంటారు.ర్రలపోగు కాలిపోయి జెండా గాలిలోకి ఎగురుతుంది. ఈ జెండాను పట్టుకున్న వ్యక్తిని భక్తులందరూ ఎత్తుకుని అతని గృహం వరకూ గిరిజన సంప్రదాయ నృత్య కళాప్రదర్శనలతో తీసుకొస్తారు. జెండాను పట్టుకున్నవ్యక్తికి ఆలయ కమిటీ నగదు బహుమతిగా రూ.1116 అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ జెండాను పట్టుకున్న కుటుంబానికి ఏడాదంతా శుభం జరుగుతుందని స్థానిక భక్తుల నమ్మకం. ఈ ప్రాంత గిరిజనులందరూ ఈ జెండా పట్టుకున్న వ్యక్తితోనే రానున్న ఖరీఫ్ సాగులో తొలి విత్తనాల నాట్లు వేయిస్తారు. జెండా పట్టుకున్న వ్యక్తితో నాట్లు వేయిస్తే అధిక దిగుబడులు వస్తాయనేది ఆదివాసీల విశ్వాసం. బీటాలైన్‌లో ప్రతి ఏటా జరిగే హోలీకి మరో ప్రత్యేకత వుంది. సుమారు 20 ఏళ్ల క్రితం హోలీ పండుగ సమయంలో ఇష్టమైన అమ్మాయి చేయిపట్టుకుని గృహానికి తీసుకువెళితే వారిద్దరికీ వివాహమైనట్లుగా గిరిజనులు భావించేవారు. ప్రతి ఏటా ఈ హోలీ పండుగ సమయంలో సుమారు 20 - 30 జంటలు చేయి పట్టుకునే పద్ధతిలో కలిసేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మహిళా చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడం, చట్టాలను మరింత కఠినతరం చేయడంతో ఈ చేయిపట్టుకుని తీసుకువెళ్లే ఆచారానికి స్థానిక గిరిజన యువత పూర్తిగా స్వస్తి పలికింది.

## నేడు చంద్రగ్రహణం - ఆలయాల మూత

తిరుపతి, **మార్చి2ప్రజావినికిడి**

చంద్రగ్రహణం కారణంగా మంగళవారం తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తారు. తిరిగి బుధవారం వేకువ జామున సంప్రోఓణ అనంతరం తెరుస్తారు. అలాగేఉదయం తిరుపతి, పరిసర ప్రాంతాల్లోని టిటిడి స్థానికాలయాలను మార్చి 3వ తేది మూసివేస్తారు. తిరిగి మార్చి 3వ తేది రాత్రి ఆలయాల తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మార్చి 3వ తేది మంగళవారం మధ్యాహ్నం 3.20 నుండి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయం, శ్రీ శ్రీనివాస ఆలయాలను మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 గంటలకు తలుపులు తెరుస్తారు. శుద్ధి, పుణ్యహావచనం ఇతర కైంకర్యాల అనంతరం సర్వదర్శనానికి అనుమతిస్తారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 తెరిచి, శుద్ధి, పుణ్యహావచనం ఇతర కైంకర్యాల అనంతరం రాత్రి 9 గంటలకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ



వేంకటేశ్వరస్వామివారి ఆలయం, తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయం, అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేస్తారు. రాత్రి 7.30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యహావచనం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. నారాయణవనంలోని శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి, కార్వేటినగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి, నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి, బుగ్గలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సత్రవాడలోని శ్రీ కరివరదరాజస్వామి ఆలయం, నగరిలోని శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేసి, రాత్రి 7:30 గంటలకు తెరుస్తారు. ఆలయ శుద్ధి, పుణ్యహావచనం తదితర సేవల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం, వాయల్పాడులోని శ్రీ పట్టాభిరామస్వామి ఆలయం, కోసువారిపల్లిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఉదయం 9 గంటలకు మూసివేసే రాత్రి 7:30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు.

# శివమ్ దూబే వల్లే గెలిచాం: గంభీర్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రౌండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోయి ఉంటే.. సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు.సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం. నేను హెడ్ కోచ్‌గా ఉన్నంత కాలం ఇదే మా ఫిలాసఫీగా ఉంటుంది.'అని గంభీర్ స్పష్టం చేశాడు.



# సంజూ శాంసన్.. కోహ్లీ, రోహిత్ రికార్డ్ బద్దలు!

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఛేజింగ్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన ఆటగాడిగా కూడా సంజూ శాంసన్ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజాలైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రికార్డులను సంజూ శాంసన్ అధిగమించాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్‌తో కోల్‌కతా వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్)అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటి వరకు టీ20 ప్రపంచకప్ ఛేజింగ్‌లో టాప్ స్కోర్ కోహ్లీ పేరిట ఉండేది. అతను టీ20 ప్రపంచకప్ 2022లో పాకిస్థాన్‌పై, 2016 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఛేజింగ్‌లో 82 పరుగులు చేశాడు.సంజూ శాంసన్ తరహాలోనే ఈ రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ భారత్‌కు విజయాన్నందించాడు. తాజా మ్యాచ్‌లో సంజూ 97 పరుగులతో అజేయంగా నిలిచి కోహ్లీని వెనక్కినెట్టాడు. ఈ మ్యాచ్‌లో 16 బౌండరీలతో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన రోహిత్ శర్మ(15)ను రికార్డును అధిగమించాడు.రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 15 బౌండరీలు బాదగా.. సంజూ శాంసన్ తాజా ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 16 బౌండరీలు బాది హిట్ మ్యాన్‌ను అధిగమించాడు. సురేశ్ రైనా తర్వాత టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ కలిగిన రెండో భారత బ్యాటర్‌గా సంజూ శాంసన్ నిలిచాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో సురేష్ రైనా(60 బంతుల్లో 101) సౌతాఫ్రికాపై సెంచరీతో చెలరేగాడు. పొట్టి ప్రపంచకప్‌లో భారత్ తరఫున సెంచరీ బాదిన ఏకైక బ్యాటర్ కూడా సురేష్ రైనానే కావడం గమనార్హం.గురువారం వాంఖడే వేదికగా జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. సంజూ శాంసన్ సూపర్ ఫామ్ నేపథ్యంలో అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు అనడానికి సంజూ శాంసన్ కెరీరే ఉదాహరణ. ఈ మెగా టోర్నీకి ముందు సంజూ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడ్డాడు. ఐదు మ్యాచ్‌లకు ఐదింటిలో విఫలమయ్యాడు. చివరకు తుది జట్టులో చోటు కోల్పోయాడు. కానీ అనూహ్యంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసలు సిసలు మ్యాచ్‌లో సత్తా చాటాడు. జీవితానికి సరిపోయే ఇన్నింగ్స్ ఆడాడు.



## 3వసారి సెమీస్‌లో ఢీ కొట్టనున్న

# భారత్, ఇంగ్లాండ్

టీమ్ ఇండియా మరోసారి టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. సూపర్-8 దశలో ఉత్కంఠభరిత పోరాటం అనంతరం, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన 'డూ లేదా డై' మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి చివరి నాలుగులో చోటు సంపాదించింది. ఇది వరుసగా మూడోసారి భారత్ సెమీఫైనల్ చేరడం విశేషం. 2022, 2024 ఎడిషన్లలో కూడా టీమ్ ఇండియా సెమీఫైనల్ దశకు చేరుకుంది.ఈ కీలక మ్యాచ్‌లో భారత్‌కు తప్పనిసరిగా విజయం అవసరం. ఓటమి పాలైతే టోర్నీ ప్రయాణం ముగిసిపోయేది. కానీ సంజూ శాంసన్ అద్భుతమైన నాటౌట్ 97 పరుగులతో జట్టును విజయానికి చేర్చాడు. 196 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ విజయవంతంగా ఛేదించింది.ఇప్పుడు మార్చి 5న ముంబై వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇది వరుసగా మూడో టీ20 వరల్డ్ కప్, ఈ రెండు జట్లు సెమీఫైనల్‌లో తలపడుతున్న సందర్భం. గత రెండు ఎడిషన్లలో ఒక విశేషమైన సెంటిమెంట్ ఉంది. భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్‌లో గెలిచిన జట్టే చివరికి చాంపియన్‌గా నిలిచింది. 2022లో భారత్‌ను ఓడించిన ఇంగ్లాండ్ ఫైనల్‌లో టైటిల్ గెలిచింది. 2024లో ఇంగ్లాండ్‌ను ఓడించిన భారత్ చివరకు ట్రోఫీ సాధించింది. ఇప్పుడు 2026లో కూడా ఇదే సెంటిమెంట్ కొనసాగుతుందా? అన్నది 8న జరిగే ఫైనల్‌తో స్పష్టమవుతుంది. మొత్తానికి, భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్ పోరు మరోసారి ప్రపంచ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురి చేయనుంది. గెలిచే జట్టే చాంపియన్ అవుతుందా? అన్న ప్రశ్నకు సమాధానం త్వరలోనే తెలుస్తుంది.



# అభిషేక్ శర్మ ఫామ్‌పై అనిల్ కుంబ్లే ఆందోళన

టీ20 వరల్డ్ కప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. సెమీఫైనల్ బెర్తులు ఖరారైన వేళ టీమిండియాలో ఒకే ఒక్కడి ఫామ్ ఇప్పుడు సెలక్టర్లకు, అభిమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అతడే యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించి, సిక్సర్ల కింగ్‌గా పేరు తెచ్చుకున్న ఈ కుర్రాడు.. మెగా టోర్నీలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన చావోరేవో తేల్చుకోవాల్సిన సూపర్ 8 మ్యాచ్‌లో కూడా అభిషేక్ చేతులెత్తేశాడు. 11 బంతుల్లో కేవలం 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరడం గిల్ సేనలో చర్చకు దారితీసింది. అభిషేక్ శర్మకు ఈ టోర్నీ ఒక పీడకలలా మారింది. గ్రూప్ స్టేజీలో ఆడిన మూడు మ్యాచుల్లో వరుసగా మూడు సార్లు డకౌట్ (0, 0, 0) అయి చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు.




# భారత్- ఆఫ్ఘనిస్తాన్ మధ్య తొలిసారి వన్డే సిరీస్

**2 దేశాల మధ్య ద్వైపాక్షిక వన్డే సిరీస్**

**3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జూన్ 2026లో మొదలు**

టి20 వరల్డ్ కప్ 2026 మ్యాచ్‌లతో టీమిండియా బిజీగా ఉన్న సమయంలో బీసీసీఐ మరో కొత్త సిరీస్ ప్రకటించింది. భారత క్రికెట్ అభిమానులకు ముఖ్యమైన అప్డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2026 తర్వాత జూన్ నెలలో భారత జట్టు తన సొంత గడ్డపై ఒక కొత్త సవాలుకు సిద్ధం కానుంది. భారత్, ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడబోతోంది. అయితే ఇది సాధారణ సిరీస్ మాత్రం కాదు. ఆ జట్టుకు గుర్తుండిపోయే మెమరీ ఇది. ఇది రెండు దేశాల మధ్య తొలి వన్డే సిరీస్ కావడంతో అఫ్గాన్ జట్టుకు ప్రాధాన్యత సంతరించుకుంది. టీమిండియా ఇప్పటివరకు ఆఫ్ఘనిస్తాన్‌తో ఐసీసీ టోర్నమెంట్లు, ఆసియా కప్ వంటి పెద్ద వేదికలపై వన్డే మ్యాచ్‌లు ఆడింది. కానీ 2 దేశాల మధ్య ఇప్పటి వరకు ఒక్క ద్వైపాక్షిక వన్డే సిరీస్ కూడా జరగలేదు. అందుకే జూన్ 2026లో జరగనున్న ఈ 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ చరిత్రలో మొదటిసారిగా నమోదు కానుంది.ఈ పర్యటన ఏకైక టెస్ట్ మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. చండీగఢ్‌లో జూన్ 6 నుండి జూన్ 10 మధ్య రెండు జట్లు తొలి జట్టులో



తలపడనున్నాయి. భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఇది రెండవ టెస్ట్ మ్యాచ్ మాత్రమే. అంతకు ముందు రెండు జట్ల మధ్య 2018లో కేవలం ఒకే ఒక టెస్ట్ జరిగింది. 2018లో జరిగిన ఆ టెస్ట్ ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ చరిత్రలో మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్ కావడం విశేషం. ఈ టెస్ట్ మ్యాచ్ తర్వాత జూన్ 14 నుండి భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య చారిత్రాత్మక వన్డే సిరీస్ కూడా జరగనుంది. దీని మొదటి మ్యాచ్ ధర్మశాలలో జరగ నుండగా, రెండవ మ్యాచ్ లక్నో వేదికగా, మూడవ మ్యాచ్ చెన్నైలో నిర్వహించనున్నారు. ప్రపంచంలోని బలమైన జట్లలో ఒకటైన భారత్‌తో వారి స్వదేశంలో ఆడే అవకాశం రావడం ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లకు పెద్ద పరీక్షగా మారవచ్చు.

కానీ వారికి ఇలా ంటి సిరీస్‌లు రావడం ఆఫ్గన్ క్రికెట్‌కు మేలు చేస్తుంది. మరోవైపు ఇండియాకు ఈ సిరీస్ 2027 వన్డే వరల్డ్ కప్ సన్నాహాల దిశగా మొదటి అడుగుగా భావిస్తున్నారు.

# పాకిస్తాన్ ఆటగాళ్లకు ఫైన్ వేసిన పీసీబీ!

2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు ప్రదర్శన చాలా నిరాశపరిచింది. దీని పరిణామాలు ఆటగాళ్లపై గట్టిగానే ఉంటోంది. పాకిస్తాన్ జట్టు పేలవమైన ప్రదర్శనకు సంబంధించి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. ప్రతి ఆటగాడికి జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించింది. పాకిస్తాన్ జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన తర్వాత ఈ శిక్ష వేశారు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, పీసీబీ స్వయంగా ఆటగాళ్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేస్తుంది, ఇది చాలా ఆశ్చర్యకరమైన నిర్ణయంగా కూడా చెబుతున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో సూపర్ 8 రౌండ్ నుంచి పాకిస్తాన్ నిష్క్రమించింది. పాకిస్తాన్ సెమీ-ఫైనల్‌కు చేరుకోలేకపోయిన వరుసగా ఇది నాల్గో ఐసీసీ టోర్నమెంట్. అందుకే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కఠినమైన చర్యలు తీసుకుంది. మీడియా నివేదికల ప్రకారం, పీసీబీ ప్రతి ఆటగాడికి 5 మిలియన్ పాకిస్తానీ రూపాయలు (సుమారు 1.6 మిలియన్ భారతీయ రూపాయలు) జరిమానా విధించింది. ఈ జరిమానా ప్రపంచ కప్‌లో పాల్గొన్న జట్టు సభ్యులందరికీ వర్తిస్తుంది. ముఖ్యంగా జట్టు ఇప్పటికే విమర్శలను ఎదుర్కొంటున్నందున, పాకిస్తాన్ క్రికెటర్లకు ఇది భారీ మొత్తం అని చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని పీసీబీ స్వయంగా తిరిగి తీసుకోనుంది. ఆటగాళ్లు తమ జీతాలు, మ్యాచ్ ఫీజులు లేదా ఇతర చెల్లింపుల నుంచి తగ్గింపులను భరించాల్సి ఉంటుంది. శ్రీలంకలో జరిగిన టీ20 ప్రపంచ కప్2026 లో పాకిస్తాన్ తన అన్ని మ్యాచ్‌లు ఆడింది, కానీ దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. వారు నెదర్లాండ్స్‌ను మూడు వికెట్ల తేడాతో ఓడించడం ద్వారా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అయితే, ఆ మ్యాచ్‌లో కూడా వారు తృటిలో ఓటమిని తప్పించుకున్నారు. ఆ తర్వాత వారు యూఎస్ఏ పై 32 పరుగుల తేడాతో గెలిచారు, కానీ టీమ్ ఇండియాపై 61 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వారు ఏదో విధంగా సూపర్ 8లోకి ప్రవేశించారు. అయితే, సూపర్ 8లలో వారి ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. వర్షం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ రద్దు అయిన తర్వాత, వారు ఇంగ్లాండ్ చేతిలో రెండు వికెట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత వారు శ్రీలంకపై గెలిచారు, కానీ నెట్ రన్ రేట్ కారణంగా సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్'

## సూర్య-వెంకీ అట్లూరి చిత్రానికి టైటిల్ ఖరారు.. ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్

ఈ ఏడాది జులైలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ లుక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ మూవీలో 'ప్రేమలు' చిత్రంతో పాప్యులర్ అయిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు.అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని స్రే వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# 'ఉస్తాద్ భగత్ సింగ్' రీమేక్ కాదు..

## అసలు నిజం చెప్పిన హరీశ్ శంకర్

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి దర్శకుడు హరీశ్ శంకర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ సినిమా తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి'కి రీమేక్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సినిమా రీమేక్ కాదని స్పష్టం చేయడమే కాకుండా అసలు 'తెరి' చిత్రంలోనే తన 'గబ్బర్ సింగ్' సినిమాలోని ఓ సన్నివేశాన్ని కాపీ చేశారని ఆరోపించారు.

తాజాగా ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన హరీశ్ శంకర్, తాను రీమేక్ చేస్తే నిజాయతీగా ఒప్పుకుంటానని స్పష్టం చేశారు. "గబ్బర్ సింగ్ చిత్రానికి నేను 'మాటలు, మార్పులు, దర్శకత్వం' అని టైటిల్ కార్డ్ వేసుకున్నాను. బహుశా తెలుగు ఇండస్ట్రీలో అలా వేసుకున్న మొదటి వ్యక్తిని నేనే. ఆ టైటిల్ కార్డు చూసి రాజమౌళి గారు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. అలాంటిది, 'ఉస్తాద్ భగత్ సింగ్' నిజంగా రీమేక్ అయితే 'కథ, మాటలు, దర్శకత్వం' అని ఎందుకు వేసుకుంటాను?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

రీమేక్ ఆరోపణలను తిప్పికొడుతూ ఆయన ఓ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. "గబ్బర్ సింగ్‌లో నేను పెట్టిన అంత్యాక్షరి ఎపిసోడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని 'తెరి'లో రౌడీలతో రైమ్స్ చెప్పించారు. నా సినిమాలోని సీన్‌ను వాళ్లు వాడుకుంటే, ఇప్పుడు ఆ సినిమానే నేను రీమేక్ చేస్తున్నానని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం?" అంటూ హరీశ్ శంకర్ అసహనం వ్యక్తం చేశారు. ఏ పోలీస్ కథలో అయినా హీరో సంఘ విద్రోహ శక్తులపై పోరాడతాడని, 'తెరి', 'టెంపర్' వంటి సినిమాలన్నీ ఆ కోవకే చెందుతాయని అన్నారు.

పవన్ కల్యాణ్ కెరీర్‌లో 'గబ్బర్ సింగ్' ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఈ కాంబోలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ




మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలకు అద్భుతమైన స్పందన రాగా, సినిమా ఈ నెల 26న విడుదలకు సిద్ధమవుతోంది.



# బ్లూ వెలుగుల్లో రకుల్ హాట్!

సాధారణంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక అద్భుతమైన క్షణం జరిగే ఉంటుంది. అయితే ఇప్పుడు తన జీవితంలో ఆ మధురమైన క్షణం ఈరోజు వచ్చింది అంటూ రకుల్ ప్రీత్ సింగ్ తన ఇంస్టాగ్రామ్ ద్వారా షేర్ చేసుకున్న ఫోటోలు అభిమానులను ఆనందానికి గురి చేస్తున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ఈమె నటించిన 'దేదే ప్యార్ దే 2' సినిమాకి గాను బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తాజాగా జీ సినీ అవార్డ్స్ 2026 వేడుకల్లో భాగంగా రకుల్ ప్రీత్ సింగ్ అవార్డు అందుకున్న క్షణాలకు సంబంధించిన ఫోటోలను తన ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఇాశ్రీంశీ ఇందులో బ్లూ గ్లిటర్తో డిజైన్ చేసిన ఒక అందమైన డ్రెస్ ధరించి తన అందాలతో వేడుకకే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది ఈ ముద్దుగుమ్మ. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన ఈ డ్రెస్ ఈమె అందాలను రెట్టింపు చేసింది. అసలే వైట్ స్కిన్ టోన్ దీనికి తగ్గట్టు బ్లూ డ్రెస్ ఇక ఈమె అందాలను ఏ విధంగా మార్చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తానికైతే బ్లూ డ్రెస్ లో జీ సినీ అవార్డ్స్ వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది రకుల్ ప్రీత్ సింగ్. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే రకుల్ ప్రీత్ సింగ్ ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంటూనే మరొకవైపు ఇలా క్యాప్షన్ జోడించింది. "చాలా సంవత్సరాల తర్వాత మొదటిసారి జీ సినీ అవార్డును అందుకోవడం ..అందులోనూ దేదే ప్యార్ దే 2 చిత్రానికి బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా కొన్ని ప్రయాణాలు ఎప్పుడు మీతోనే ఉంటాయి. అది ప్రేమ, నవ్వు ఇలా ఎప్పటికీ గుర్తించుకునే జ్ఞాపకాలతో ఆ ప్రయాణం నిండి ఉంటుంది.నాకు మద్దతుగా నిలిచిన అజయ్ దేవగన్, యాక్టర్ మాధవన్, చిత్ర బృందానికి నేను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా నన్ను నమ్మి ఆదరిస్తున్న అభిమానులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను" అంటూ రకుల్ ప్రీత్ సింగ్ క్యాప్షన్ జోడించింది.




# మాస్ బీట్ అదిరింది!


## 'పెద్ది' నుంచి రెండో సాంగ్ రిలీజ్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. ఈ సినిమా నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న రెండో పాట 'రై రై రా రా' (ఝఱ ఝఱ ఝు ఝు) నేడు (మార్చి 2) విడుదలైంది. ఇప్పటికే రిలీజైన మొదటి పాట 'చికిరి' మంచి విజయం సాధించగా, ఈ రెండో సింగిల్ కూడా చార్ట్ బస్టర్‌గా నిలిచే లక్షణాలు కనిపిస్తున్నాయి.

దిగ్గజ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన ఈ గీతానికి అనంతశ్రీరామ్ సాహిత్యం అందించాడు. ఈ పాటను ఏఆర్ రెహమాన్ స్వయంగా ఆలపించడం విశేషం. పక్కా మాస్ బీట్, హీరో ఎలివేషన్ థీమ్‌తో సాగే ఈ పాటలో ఇంటెన్స్ ఫోక్ పెర్కషన్ హైలైట్‌గా నిలిచింది. గ్రామీణ నేపథ్యంలో సాగే విజయ గీతంలా ఇది రూపొందింది. ముఖ్యంగా 'రై రై రా రా' అనే హుక్ లైన్ వినగానే ఆకట్టుకునేలా ఉందని, థియేటర్లలో ఈ పాటకు రెస్పాన్స్ గట్టిగా ఉంటుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

ఈ చిత్రంలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొన్ని షూటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ముందుగా ప్రకటించినట్లే ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ స్పష్టం చేసింది. చికిరి తర్వాత వచ్చిన ఈ మాస్ నంబర్ మెగా ఫ్యాన్స్‌లో ఫుల్ జోష్ నింపింది.

# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్



గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.

# సొంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు

వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో



తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613